వణికిస్తున్న విషజ్వరాలు

- జ్వరపీడితుల్లో చికున్‌గున్యా లక్షణాలు..?
- తండాల్లో పెరిగిన బాధితులు
- ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్న వైనం



మాచారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

మాచారెడ్డి : జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. దీంతో బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని ఆయా గ్రామాల్లో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పాల్వంచ మండలం భవానీపేట తండాలో జ్వరాలు విజృంభించడంతో అక్కడ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అలాగే లక్ష్మీరావులపల్లిలో ఇద్దరికి డెంగీ సోకి ఆస్పత్రిలో చేరారు. దీంతో అక్కడ దోమల నివారణ మందు పిచికారి చేశారు. జ్వరపీడితుల్లో అధిక శాతం దగ్గు, జలుబు, కీళ్లు, ఒళ్లు నొప్పుల లక్షణాలు ఉన్నాయి. జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పుల లక్షణాలు చికున్‌గున్యా జ్వరాల్లో కనబడతాయి.

19ఏళ్ల కిందటే..

2005–06లో మండలంలోని ఆయా గ్రామాలు చికున్‌గున్యా జ్వరాలతో అట్టుడికింది. 2005లో మొట్టమొదట మండలంలోని లచ్చాపేటలో చికున్‌గున్యా కేసు బయటపడింది. అప్పుడొచ్చిన చికున్‌గున్యా నొప్పులతో మొన్నటి వరకు బాధ పడ్డారు. ప్రస్తుతం కూడా అవే లక్షణాలు జ్వర పీడితుల్లో కనబడుతున్నాయి. డెంగీ, వైరల్ టైఫాయిడ్ జ్వరాలతో బాధపడే వారిలో కూడా చికున్ గున్యా లక్షణాలు కనబడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న పిల్లలు జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి రూ.30 నుంచి 40 వేల వరకు ఖర్చు అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. 102 నుంచి 103 వరకు జ్వరం నమోదు అవుతుంది. ఉమ్మడి మాచారెడ్డి మండలంతో పాటు పొరుగున ఉన్న దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రామారెడ్డి మండలాల్లో జ్వర పీడితుల్లో చికున్ గున్యా లక్షణాలు కనబడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

నిర్ధారణ లేకుండా చెప్పలేం..



డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాల్లో సైతం కీళ్లు, ఒళ్లు నొప్పులుంటాయి. అలాగని రోగ నిర్ధారణ చేయనిదే వ్యాధిని తేల్చలేం. లక్షణాలు ఉన్నంత మాత్రాన చికున్‌గున్యా అంటూ అనుమానపడుతూ ప్రజలు ఆందోళనకు గురి కావద్దు.

– డాక్టర్ శరత్ కుమార్, ఎండీ, అసోసియేట్ ప్రొఫెసర్, కామారెడ్డి మెడికల్ కళాశాల

పల్లె దవాఖానాలో పత్తాలేని వైద్యం



మహమ్మద్‌నగర్‌లోని పల్లె దవాఖానా

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులతో పాటు చికున్ గున్యా కేసులు విజృంభిస్తున్నాయి. గ్రామంలోని కుర్మ వాడ ఇంటింటా చికెన్ గున్యాతో రోగులు మంచం పట్టారు. కాళ్లు, చేతుల కీళ్ల నొప్పులు, తీవ్రమైన జ్వరాల బారిన పడిన రోగులు బాన్సువాడలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకుంటున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులు మాత్రం ప్రైవైట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ జ్వరాల బారిన పడుతున్నారు.

మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో పల్లె దవాఖానా ఉన్నా వైద్య చికిత్సలు అందించే వారు కరువయ్యారు. పల్లె దవాఖాన వైద్యురాలు సెలవుపై వెళ్లడం, ఆరోగ్య కార్యకర్త బదిలీ కావడంతో ఇక్కడ వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఆశవర్కర్లు మాత్రం పల్లె దావాఖానాను నిత్యం తెరిచి ఉంచుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి ప్యారసిటమల్ గోలీ ఇచ్చి పంపుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇకనైనా స్పందించి పల్లె దావాకానాలో రోగులకు వైద్య చికిత్సలు అందేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీడీ కార్మికులకు పింఛన్ పెంచాలి



మాట్లాడుతున్న శివ్వంది సత్యం

కామారెడ్డి రూరల్ : రాష్ట్రంలో అధికారంలోకి రాగానే సామాజిక పెన్షన్‌లను రెండింతలు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పింఛన్లు పెంచలేదని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం ఆరోపించారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ పింఛన్ ఇవ్వాలన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికుల విషయంలో కటాఫ్ తేదీ పెట్టి కొందరికే పెన్షన్‌లు వర్తింపచేస్తున్నారని, ఈ విషయంలో నిబంధనలు పక్కనపెట్టి పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులందరికి జీవనభృతి మంజూరు చేయాలన్నారు ఈ సమావేశంలో ఐరేని రాజేందర్, ఎస్‌కే హసన్, తాళ్ల దివ్య, చెరుకు లక్ష్మీ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ..

తిప్పాపూర్ వీడీసీ నూతన కార్యవర్గం



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ సిద్దరాములు, ఉపాధ్యక్షులుగా నారిగళ్ల రాజు, మధుకర్‌రెడ్డి, ఏ భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జిల్లెల బాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్యామర్తి జీవన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కొండ సిద్దరాములు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు.

బాన్సువాడ పీఆర్‌టీయూ సంఘం..



బాన్సువాడ రూరల్ : పీఆర్‌టీయూ బాన్సువాడ గ్రామీణ శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్వ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ సంతోష్, అసోసియేట్ అధ్యక్షులుగా నక్క ప్రవీణ్, వైస్ ప్రసిడెండ్‌గా గంగామణి, కార్యదర్శిగా బి.చంద్రకాంత్, జి. సౌజన్యలను ఎన్నుకున్నారు.

మార గుడాడి రెడ్డి సంఘం..



మార మహిపాల్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో శనివారం మార గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మార తిరుపతి రెడ్డి, కార్యదర్శిగా మార నవీన్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఏనుగు రాజు, కోషాధికారిగా మార శ్రీనివాస్ రెడ్డి, సహాయ కోశాధికారిగా మార నర్సారెడ్డి, డైరెక్టర్‌లు మార పెద్ద గంగారెడ్డి, మార మోహన్ రెడ్డి, మార బాల్‌రెడ్డి, మెయింటనెన్స్ మార రమేశ్ రెడ్డిలను ఎన్నుకున్నారు.

ఘనంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి బర్త్‌డే



కేక్ కట్ చేస్తున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి



సుభాష్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న జైపాల్‌రెడ్డి

ఎల్లారెడ్డి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి బర్త్‌డేను శనివారం ఎల్లారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని సుభాష్‌రెడ్డి ఇంటివద్దకు చేరుకున్న పలు మండలాల నాయకులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, పెద్దసంఖ్యలో అభిమానుల సమక్షంలో సుభాష్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. అభిమానులు ఆయనకు గజమాలతో సత్కరించి మెమొంటోను సమర్పించారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బాధ్యులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేదల పాలిట పెన్నిది అని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జైపాల్ రెడ్డి అన్నారు. ఆయనకు స్వీట్లు తినిపించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిర్మన్‌పల్లి మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నర్సారెడ్డి, పెద్ద మైసాగౌడ్, సంతోష్‌పాటిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



బీబీపేట : మండల కేంద్రంలోని 9వ వార్డులో ఉన్నటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంతే కాకుండా విద్యుత్ వైర్లకు పూర్తిగా పిచ్చిమొక్కల తీగలు అల్లుకొని వైర్లను పూర్తిగా కప్పేశాయి. దాని పక్కనే ఉన్నటువంటి మరో విద్యుత్ స్తంభానికి కూడా పిచ్చి మొక్కల తీగలు అల్లుకొని పలుసార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్) : గ్రామీణ ప్రాంత ప్రజలు పోస్టాఫీస్‌లలోని పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ సూచించారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ పోస్టమాస్టర్ వెంకటేశ్, మహమ్మద్ నగర్ బీపీఎం రఘువీర్, యూసుఫ్, అనిల్, బాలయ్య ఉన్నారు.



ఉపాధి హామీ పనులపై గ్రామసభ

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహిస్తున్నామని కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉపాధి హామీలో చేసిన పనులపై ఆడిట్ జరుగుతుందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

బాన్సువాడ : పట్టణంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బీసీ బాలుర వసతి గృహంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులకు స్వచ్ఛదనం–పచ్చదనంపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు వీరేశం, అజయ్, అభిరాంకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, వస్సీ, కవిత, మౌలానా తదితరులు ఉన్నారు.

వర్షంతో దెబ్బతింటున్న పంటలు



ఉత్తునూర్–వజ్జపల్లి శివారులో మొక్కజొన్న

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు పద్మాజివాడి, కల్వరాల్, తుక్కోజివాడి, తిమ్మోజివాడి, ఉత్తునూర్, వజ్జపల్లి, లింగంపల్లి, భూంపల్లి తదితర గ్రామాల పరిధిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ తదితర పంటలు నీళ్లల్లో మురిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు పంటలు పూర్తిగా మురిగిపోతున్నాయని వారంటున్నారు. మండలంలో వరి 9,468 ఎకరాలు, మొక్కజొన్న 7,285 ఎకరాలు, పత్తి 4,352 ఎకరాలు, సోయాబీన్ 2,484 ఎకరాలు, ఇతర పంటలు 808 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటలపై వర్షప్రభావం తీవ్రంగా ఉండడంతో పాడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సకాలంలో పంటలను సాగు చేసినప్పటికి దిగుబడి రావడం కష్టంగా మారిందని చెబుతున్నారు. మండల వ్యవసాయాధికారులు స్పందించి పరిష్కారం చూపాలన్నారు.

పాఠశాలలో ఎన్నికలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. శనివారం కౌన్సెలింగ్ ఎన్నికల్లో గెలుపొందిన స్కూల్ కెప్టెన్‌గా శిరీష, వైస్ కెప్టెన్‌గా అక్షయ, స్పోర్ట్స్ కెప్టెన్‌గా స్రవంతి, లిటరసీ కెప్టెన్‌గా స్పందన, కల్చరల్ కెప్టెన్‌గా హర్షిణి ఎన్నికైన వారికి విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల్లో ఐక్యత చాటాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కి, మిర్జాపూర్, కామిశెట్టి పల్లి, నెమ్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ కేంద్రంలో గొప్ప పదవుల్లో ఉన్న ప్రతి నాయకుడు యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారే అన్నారు. కావున రాబోయే యువజన ఎన్నికల్లో ఐక్యత చాటాలన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్యామల, నాయకులు మల్లేశ్, వెంకటి, మధు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికం

సలాబత్‌పూర్ ఆలయంలో పూజలు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శ్రావణమాస శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. మన రాష్ట్రంలో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహారాజ్ ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అలాగే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

అంజన్న ఆలయంలో సిందూర పూజలు




కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి విశేషమైన సింధూర పూజలను ఆలయ సహాయ అర్చకుడు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వెంకటేశ్వరాలయంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయం ఆవరణలో శావ తీశారు.

ఆలయాలకు శ్రావణ మాస శోభ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలో ఆలయాలకు శ్రావణ మాస శోభ సంతరించుకుంది. శ్రావణ శనివారం కావడంతో దుర్కి గ్రామంలో సోమేశ్వర ఆలయంలోను, నెమ్లిసాయి ఆలయాలు కిటకిటలాడాయి. దుర్కి సోమేశ్వర ఆలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వెంకటేశ్వరాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వెంకటేశ్వర ఆలయంలో శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి–పుష్పమ్మ ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో ఎమ్మెల్యే వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మ కర్త పోచారం శంభురెడ్డి దంపతులు తదితరులు ఆలయంలో పూజలు చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం



నిజాంసాగర్(జుక్కల్) : శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం 51సార్లు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణంతో రామనామస్మరణలు దద్దరిల్లాయి. చాలీసా పారాయణానికి వచ్చిన భక్తులకు అంజనాద్రి ఆలయ కర్త పట్లోళ్ల కిషోర్‌కుమార్ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి..



మాచారెడ్డి : శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. వాహన పూజలు, పుట్టు వెంట్రుకలు తదితర శుభకార్యాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ శనిగరం కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, అర్చకులు గ్రామస్తులు ఉన్నారు.

క్లుప్తంగా

ఓంశాంతి ఆధ్వర్యంలో రక్షాబంధన్



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షబంధన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డిలో పాటు. ప్రజలకు వ్యాపారులకు నేతలకు రాఖీలు కట్టారు. రక్షబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీలు కామారెడ్డి ఇన్‌చార్జి జయ బహెన్, గంగాదేవి, చంద్రకళ, రోజారాణి, వసంత పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహబంధం



భిక్కనూరు : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో మండలస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఓటమి పాలైన వారు మరింత శ్రమ చేసి భవిష్యత్తులో విజయం సాధించేందుకు క్రీడల్లో మెళకువలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కొర్పోల్ గ్రామంలో శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు 24 యునిట్ల రక్తం దానం చేసినట్లు మండల రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మంజుల, నర్సింలు, ఎల్లారెడ్డి డివిజన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు రవిగౌడ్ తదితరులున్నారు.

దివంగత కేంద్ర మంత్రి శివశంకర్‌కు నివాళి



కామారెడ్డి అర్బన్ : దివంగత కేంద్ర మంత్రి జస్టిస్ పి శివశంకర్ 95వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. శివశంకర్ బీసీల ఐక్యత కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి పెట్టుగాడి అంజయ్య, రాష్ట్ర బాధ్యులు నీలం నర్సింలు, జిల్లా ప్రతినిధులు ఆకుల శ్రీనివాస్‌రావు, సంకరి లింగం తదితరులున్నారు.

పొదుపు సంఘాలు అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో పొదుపు సంఘాలు అన్ని రకాల అభివృద్ధి చెందాలని సీసీ గంగారెడ్డి అన్నారు. మండలంలోని కన్‌కల్ గ్రామంలో శనివారం గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించుకున్నారు. ప్రతినెల 10 తేదీ లోపు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు. ముఖ్యంగా పాడి పశువులు కొనుగోలు చేసేందుకు శ్రీనిధిద్వారా రుణాలు పొందవచ్చన్నారు. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



బీబీపేట: వాహదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు పెట్టుకోవాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, రాములు, సిబ్బంది శంకర్, రాజయ్యలు ఉన్నారు.

సంక్షిప్తం

ఇద్దరు కానిస్టేబుళ్ల రక్తదానం

కామారెడ్డి అర్బన్ : డెంగీ వ్యాధితో బాధపడుతున్న పాల్వంచకు చెందిన ఓ రోగికి రిజర్వ్‌డ్ కానిస్టేబుళ్లు హరీష్, నవీన్‌కుమార్ ఓ పాజిటివ్ రక్తదానం చేసినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. డెంగీ రోగికి ప్లేట్‌లెట్స్ నిమిత్తం రక్తాన్ని వినియోగించినట్లు తెలిపారు.

పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి టౌన్ : ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన కామన్ పీజీ ప్రవేశ పరీక్ష(సీపీజీఈటీ) ఫలితాలలో సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో హితేష్ సేన రెడ్డి 3వ ర్యాంకు, ఫిజిక్స్ విభాగంలో సిమ్రాన్ 21వ ర్యాంకును సాధించారు. స్టాటిటిక్స్ విభాగంలో వెన్నెల, నందిని, ఝూన్సీ, హిందిలో సరిత, డాటా సైన్స్‌లో అఖిశ్రీ, న్యూట్రిషన్‌లో అధీనా ముస్కాన్, పోలిటికల్ సైన్స్‌లో బాబులాల్, రవితేజ, హిస్టరిలో స్వాతిలు రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారు.

నేడు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ


బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ దళిత మోర్చా నాయకుడు తుకారాం, మండల అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను సక్సెస్ చేయాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం సైబర్‌నేరాలపై ప్రయాణికులకు ఆయన అవగాహన కల్పించారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కానిస్టేబుళ్లు గంగారాం, వినోద్ ఉన్నారు.

అకారణంగా తొలగించారు..



రాజంపేట : కేజీబీవీ పాఠశాలలో స్కావెంజర్‌గా పనిచేస్తున్న తనను అకారణంగా విధుల నుంచి తొలగించాలని రాజంపేట కేజీబీవీలో స్కావెంజర్‌గా పనిచేస్తున్న లావణ ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో అక్రమాలకు పాల్పడుతున్న కొందరిని ప్రశ్నించినందుకే తనను తొలగించారని, నాకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

పోలీసులకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



తాడ్వాయి : ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఎల్లారెడ్డి సెంటర్ ప్రతినిధులు శనివారం తాడ్వాయి ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లకు రాఖీలు కట్టారు. రాఖీ పండుగ సోదరీ, సోదర భావం తెలిపే గొప్ప పర్వదినమని బీకే సంతోషిణి అన్నారు. మిఠాయిలు పంచారు.